‘ఎస్సెల్బీసీ పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందని గత కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది’ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలివి..

కాసేపు ఈ వ్యాఖ్యలు నిజమనే అనుకొందాం..

కాంగ్రెస్‌కు పేరురావొద్దని నిజంగా కేసీఆర్ ప్రభుత్వం అనుకొందని భావిద్దాం.

అయితే, ఉమ్మడి రాష్ట్రంలో రూపకల్పన జరిగి, పనులు మొదలై పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్... ప్రాజెక్టులను కూడా హస్తంపార్టీకి పేరురావొద్దన్న సాకుతో అదే కేసీఆర్ ప్రభుత్వం పడావుపెట్టాలిగా? ఆ ప్రాజెక్టులు మూలన పడాలిగా??

కానీ, ఏం జరిగింది??

రాకెట్ వేగంతో ఆయా పెండింగ్ ప్రాజెక్టులు.. రన్నింగ్ ప్రాజెక్టులుగా మారి పాలమూరు తలరాతే మారిపోయింది. దీన్నిబట్టి తెలంగాణ ప్రజల ప్రయోజనాలే కేసీఆర్ ప్రభుత్వానికి ముఖ్యంగానీ, రాజకీయ ప్రయోజనాలు కాదన్నది ఇక్కడ సుస్పష్టమవుతున్నది. రేవంత్ సర్కారు దుష్ప్రచారం రాజకీయ హైడ్రామా అని తేటతెల్లమవుతున్నది. ఎస్సెల్బీసీని చిత్తశుద్ధితో పూర్తిచేయడానికి కేసీఆర్ ప్రభుత్వం అమిత ప్రాధాన్యతనిచ్చింది. ఉమ్మడిపాలనలో అనాలోచిత ప్రభుత్వ నిర్ణయాలతో తీసుకొచ్చిన పీటముడిలాంటి ఎస్సెల్బీసీని ఎంతో శ్రమించి ఓ దారిలోకి తెచ్చేందుకు అప్పటి బీఆర్ఎస్ సర్కారు తనవంతు ప్రయత్నం చేసింది. అందుకే 11.48 కిలోమీటర్ల సొరంగ నిర్మాణంతో పాటు రెండు రిజర్వాయర్లు పూర్తయ్యాయి.

చిక్కుముడి కాదు.. పీటముడి

- మూడడుగులు ముందుకు.. ఆరడుగుల వెనక్కిగా ఎస్సెల్బీసీ
- గుదిబండగా తయారైన టన్నెల్ బోరింగ్ మెషీన్ టెక్నాలజీ
- అసలే సంక్లిష్టం... దీనికి తోడైన నిర్మాణ సంస్థ జేపీ అలసత్వం
- బేరింగ్ తేవడం, కరెంటు బిల్లు చెల్లింపుల్లో తీవ్ర కాలయాపన
- అయినప్పటికీ బీఆర్ఎస్ హయాంలో 11.48 కి.మీ. నిర్మాణం
- ఆరుసార్లు గడువు వ్యవధిని పొడగించిన కేసీఆర్ ప్రభుత్వం
- గత సర్కారు నిర్లక్ష్యమంటూ ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయ డ్రామా

హడావుడిగా మొదలు పెట్టడంతో ఎస్సెల్బీసీ భవితవ్యమే ప్రశ్నార్థకం

(గుండాల కృష్ణ)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 4 (నమస్తే తెలంగాణ): భూసేకరణ మొదలు నీటి కేటాయింపుల వరకు పాలమూరు ప్రాజెక్టుల్లో నెలకొన్న ఎన్నెన్నో చిక్కుముళ్లను ఒక్కొక్కటిగా విప్పింది అప్పటి కేసీఆర్ సర్కారు. దాని ఫలితమే తెలంగాణ ఏర్పడిన మూడేండ్లలోపే పాలమూరు జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందింది. అదేరీతిన ఎస్సెల్బీసీ పనులకూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. అందుకే 11.48 కిలోమీటర్ల సొరంగ నిర్మాణంతో పాటు రెండు రిజర్వాయర్లను దాదాపుగా పూర్తి చేసింది. అయినా తొమ్మిదిన్నర కిలోమీటర్ల పనులు పెండింగులో ఉండటానికి కారణం... టీబీఎం టెక్నాలజీ రూపంలో ఉన్న పీటముడి! దీనికి తోడు కాంగ్రెస్ హయాంలో టెండర్లు దక్కించుకొని గుదిబండలా తయారైన నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ లిమిటెడ్ నిర్వాకం. ఇవన్నీ ప్రభుత్వంలోని కాంగ్రెస్ పెద్దలకు తెలియనివి కావు... కాకపోతే 15 నెలల్లో 18 మీటర్ల సొరంగాన్ని తవ్వి దానిని సైతం కుప్పకూల్చి చివరకు ప్రాజెక్టు భవితవ్యాన్నే ప్రశ్నార్థకంగా మార్చిన తమ ఘనకార్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు నోటికి పని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మూడడుగులు ముందుకు... ఆరడుగులు వెనక్కి! అన్నట్లుగా సాగిన సొరంగం పనుల తీరును ఓసారి పరిశీలిస్తే... తెలంగాణకు గ్రావిటీ మీద కృష్ణాజలాలు పారకుండా ఉండేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి గుదిబండను తగిలించిందోనన్న వాస్తవం అర్థమవుతుంది.

ఎస్సెల్బీసీపై కాంగ్రెస్ ఇలా..

ఎస్సెల్బీసీ పనుల్లో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు ఎలా ఉన్నా... తెలంగాణకు నీళ్లు ఇచ్చేందుకు కాదు! కాగితాలపై నిధులు ఇచ్చామని చెప్పుకునేందుకు ఈ ప్రాజెక్టును ప్రారంభించారనేది బహిరంగ రహస్యం. దశాబ్దాల కిందటనే రూపదిద్దుకున్న ఈ ప్రాజెక్టును అటకెక్కించి... ఆ తర్వాత వచ్చిన శ్రీశైలం కుడి గట్టు, తెలుగుగంగ ప్రాజెక్టులను నెత్తిన పెట్టుకొని తీరం చేర్చిన గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తరాజులో చూపేందుకు ఎస్సెల్బీసీని మొదలు పెట్టింది. ఒకటీ అరా కాదు... ఏకంగా 44 కిలోమీటర్ల సుదీర్ఘ సొరంగం, అందునా మధ్యలో ఏ ఒక్కచోటనైనా బయటికి వెళ్లేందుకు ఒక్క ఆడిట్, షాఫ్టుకు అవకాశం ఇవ్వకుండా ప్రాజెక్టును మొదలుపెట్టారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో (ఈపీసీ) టెండరు దక్కించుకున్న జేపీ సంస్థ పూర్తిగా సబ్ కాంట్రాక్టులతోనే నెట్టుకొస్తున్నది.

తొలుత చైనా కంపెనీకి

టీబీఎం ద్వారా సొరంగ నిర్మాణాన్ని తొలుత చైనా కంపెనీతో సబ్ కాంట్రాక్టు ఒప్పందం కుదుర్చుకుంది. కొన్నిరోజుల పాటు ఆ సంస్థ ప్రతినిధులు సర్వే చేశారు. తీరా... ఆ కంపెనీ తప్పుకోవడంతో అమెరికాకు చెందిన రాబిన్‌సన్‌తో సబ్ కాంట్రాక్టు ఒప్పందం కుదుర్చుకుంది. ఆదిలో సొరంగ నిర్మాణ పనులను వేగంగా చేసిన సదరు జేపీ కంపెనీ టీబీఎం పాతబడి సాంకేతిక సమస్యలు తలెత్తేకొద్దీ చేతులు దులుపుకోవడం ప్రారంభించింది. తెలంగాణ ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేనాటికే సదరు జేపీ కంపెనీ ఆర్థికంగా ఇబ్బందుల్లోకి పోయింది. దీంతో ఆదిలో వేగంగా జరిగిన పనుల్లో జాప్యం జరిగింది.

డీవాటరింగ్ అతి పెద్ద సమస్య

- సొరంగ నిర్మాణంలో డీవాటరింగ్ ఒక పెను సవాల్. ఎస్సెల్బీసీలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది.
- శ్రీశైలం నుంచి నల్గొండ జిల్లావైపు కృష్ణాజలాలు గ్రావిటీ మీద రావాల్సి ఉంటుంది. అందుకే సొరంగ నిర్మాణం శ్రీశైలం వైపు నుంచి నల్గొండ వైపునకు వచ్చే కొద్దీ వాలుగా ఉండాలి. అందుకే సాంకేతిక డిజైన్‌లో భాగంగా సొరంగ మార్గం ప్రతి 3 వేల మీటర్లు (మూడు కిలోమీటర్లు)కు ఒక మీటరు వాలుగా ఉంటుంది.
- నల్గొండ వైపు తవ్వే టీబీఎంకు డీవాటరింగ్ సమస్య లేదు. ఎందుకంటే టీబీఎం వాలు నుంచి పైకి తవ్వుతున్నందున నీళ్లు సొరంగం బయటికి ప్రవహిస్తాయి.
- కానీ శ్రీశైలం వైపు టీబీఎం వాలుకు అనుగుణంగా తవ్వుకుంటూ ముందుకుపోతుంది. నీళ్లు టీబీఎం వైపునకు వస్తాయి. అందుకే ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా ఎత్తిపోయాలి. ఇలా ప్రస్తుతం 14వ కిలోమీటరు వద్ద ఉన్నందున దాదాపు 4.5 మీటర్ల మేర నీటిని ఎత్తి సొరంగం బయటికి తీసుకురావాలి. అందుకే ఘటన జరిగిన ప్రస్తుతం ప్రాంతం వరకు ఐదు పంపింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి.
- ఈ మోటార్లు నిరంతరం నీటిని బయటికి పంపించాలి. గంట ఆగినా టీబీఎం మునిగిపోతుంది.

అవుట్‌లెట్ కథ ఇది..

- అవుట్‌లెట్ సొరంగ నిర్మాణ పనులు కూడా 2018 వరకు సాఫీగానే సాగాయి. వాలు ఉన్నందున ఊట నీరు నేరుగా సొరంగం బయటికి పోతున్నందున ఇక్కడ డీవాటరింగ్ సమస్య అనేది లేదు.
- కానీ సుదీర్ఘకాలం నడిచినందున ఒకసారి బేరింగ్ అరిగిపోయి, యంత్రం ఆగిపోయింది. నిర్మాణ సంస్థ కోరిక మేరకు కేసీఆర్ ప్రభుత్వం అడ్వాన్సు మొత్తాన్ని ఇవ్వడంతో జేపీ సంస్థ బేరింగ్ తయారీకి అర్డర్ ఇచ్చింది.
- ఆర్డర్ ఇచ్చిన సంవత్సరానికిగాను బేరింగ్‌రాదు. ఇలా తొలిసారిగా పనులకు బ్రేక్ పడింది. బేరింగ్ వచ్చిన తర్వాత కొంతకాలం నిర్మాణ పనులు జరిగాయి. మళ్లీ బేరింగ్ చెడిపోవడంతో పనులు నిలిచిపోయాయి.
- అయినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ నిధులు ఇచ్చింది. కొన్ని నెలల తర్వాత వచ్చిన బేరింగ్ పోర్టులో ఉంటే అందుకు చెల్లించాల్సిన సుంకం లేదని జేపీ కంపెనీ చేతులెత్తేస్తే కేసీఆర్ ప్రభుత్వమే ఆ మేరకు నిధులు ఇచ్చి బేరింగ్ తెప్పించింది.
- మళ్లీ కొన్ని నెలలకే బేరింగ్ అరిగి, యంత్రం ఆగిపోయింది. తీరా ప్రభుత్వం ఆరా తీస్తే అది సెకండ్ హ్యాండ్ బేరింగ్ వాడినట్లుగా తేలింది. అప్పటికే అడ్వాన్సుగా డబ్బులు తీసుకోవడమే కాకుండా ఇన్‌లెట్ డీవాటరింగ్‌కు కూడా బిల్లులు ఇవ్వాలంటూ జేపీ కంపెనీ సాకులు చూపి పనులు నిలిపివేసింది.

పదేండ్లలో పనులు ఆగిందెక్కడ?!

- టైగర్ రిజర్వు ఫారెస్టు కారణంగా శ్రీశైలం సొరంగం ఏకధాటిగా 44 కిలోమీటర్లు కనీసం ఒక ఆడిట్... చివరకు కించిత్తు షాఫ్ట్ (భూ ఉపరితలం నుంచి దిగువకు మార్గం) కూడా లేకపోవడంతో అది పెను సమస్య అనేది కాలక్రమేణా నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్‌తో పాటు తెలంగాణ ఇంజినీర్లకు అనుభవంలోకి వచ్చింది. సరిగ్గా అదే సమయంలో నిర్మాణ సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లడంతో కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలిచినప్పటికీ నిలబడి, కుదురుగా పని చేయలేకపోయింది. తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం (ట్రీ) సైతం అనేకసార్లు జేపీ-ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా పనులు వేగంగా జరిగేందుకు ప్రయత్నించింది. కేసీఆర్ హయాంలో 11.482 కిలోమీటర్ల మేర సొరంగాన్ని నిర్మించారు.

ఇన్‌లెట్ కథ ఇది..

- 2018 వరకు ఇన్‌లెట్, అవుట్‌లెట్ పనులు మెరుగ్గానే జరిగాయి. కానీ, అప్పటికే పనులు మొదలై దశాబ్దానికి పైగా కావడంతో నిర్మాణ సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లోకి పోయింది. టీబీఎం పాతదై, సాంకేతిక సమస్యలు మొదలయ్యాయి. అయినప్పటికీ పదేండ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం అడ్వాన్సుగా జేపీ కంపెనీకి అడిగినంత డబ్బులు ఇచ్చిందే తప్ప ఒక్కపైసా కూడా బిల్లుల పెండింగ్ పెట్టలేదు.
- వర్షాకాలం రాగానే శ్రీశైలం వైపు సొరంగంలోకి వరద నీరు రావడంతో పనులు నిలిచిపోయేవి. వరదతో పాటు సొరంగంలో ఊరే నీళ్లను తోడేందుకు భారీఎత్తున విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వచ్చేది. జేపీ కంపెనీ ఆ బిల్లులు చెల్లించలేక చేతులెత్తేయడంతో టీబీఎం సిద్ధంగా ఉన్నా ఇన్‌లెట్ పనులు ముందుకు సాగలేదు.
- అనుకున్నదానికంటే డీవాటరింగ్ ఎక్కువ ఉందని చెప్పడంతో కేసీఆర్ ప్రభుత్వం ఈపీసీ కాంట్రాక్టులో డీవాటరింగ్ రేట్లను జేపీకి ఇచ్చింది. అయినా నిర్మాణ సంస్థ పనుల్లో వేగాన్ని పెంచలేకపోయింది.
- 2022లో కరెంటు బిల్లు కట్టకపోవడంతో ఇన్‌లెట్‌లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. జేపీ కంపెనీ చేతులెత్తేసింది. దీంతో కరెంటు బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుందని, కరెంటు సరఫరా నిలిపివేయవద్దని కేసీఆర్ మంత్రివర్గం తీర్మానించింది.
- ఆతర్వాత పనులు ప్రారంభించిన జేపీ కంపెనీ 2023లో ఊట నీరు భారీగా పెరగడంతో పనులు నిలిపివేసింది. ఈ నేపథ్యంలో 2023 సెప్టెంబరులో అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమీక్షలో ‘అక్కడ ఎనిమిది మీటర్ల పొడవున షియర్ జోన్ (రాతి పొరలు కాకుండా మట్టి, రాళ్ల పొరల మధ్య భారీ నీటి ఊటలు ఉండటం)ను గుర్తించినట్లు నిర్మాణ కంపెనీ, అధికారులు చెప్పారు.

ప్రాజెక్టు భవితవ్యం ప్రశ్నార్థకం

సాంకేతికంగా అన్ని కోణాల్లో సొరంగ పనులనేవి ప్రారంభంలో వేగంగా జరుగుతాయనేది అందరికీ తెలిసిందే. ఆపై లోపలికి పోయేకొద్దీ అన్నిరకాల సమస్యలు ముసురుకుంటాయి. ఈ నేపథ్యంలో ఆచితూచి పనులు చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే క్రమంలో కేసీఆర్ ప్రభుత్వం సాధ్యమైనంత వరకు పనులను ముందుకు తీసుకుపోయింది. కానీ కష్టాల లోతు తెలియని కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది మొదలు కేసీఆర్ హయంలో ఎస్సెల్బీసీ నిర్లక్ష్యానికి గురైంది... తాము పరుగులు పెట్టిస్తామంటూ ప్రబల్చాలకు పోయింది. సాంకేతిక లోతులు పరిశీలించకుండా, పర్యవేక్షణ సాగించకుండా అనాలోచిత వైఖరికి నిర్మాణ సంస్థ కూడా తోడవడంతో ఎనిమిది మంది అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. చారిత్రక ఎస్సెల్బీసీ ప్రాజెక్టు భవితవ్యం ప్రశ్నార్థకమైంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కనీసంగా రెండు, మూడు సంవత్సరాలకుగాను ఇన్‌లెట్ వైపు పనులు మొదలయ్యే పరిస్థితులు లేవని ఇంజినీర్లే చెబుతున్నారు.

6 సార్లు గడువు పొడిగించిన కేసీఆర్ సర్కార్...

సాధారణంగా ఏదైనా నిర్మాణ కంపెనీ పనుల్లో జాప్యం చేస్తే ఒకట్రెండు సార్లు నీటిపారుదల శాఖ నోటీసులు ఇవ్వడమో, సహేతక కారణాలుంటే గడువు పొడిగించి ఒత్తిడి పెంచుతుంది. కానీ ఎస్సెల్బీసీ సొరంగ పనుల తీరే వేరు. నిర్మాణ కంపెనీ జేపీ పదేపదే అడ్వాన్సు బిల్లులు తీసుకోవడంతో పాటు పనుల్లో కూడా వేగం పెంచలేదు. వాస్తవానికి ఆ నిర్మాణమే సంక్లిష్టమైనదని ఆదిలోనే గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం సాధ్యమైనంత వరకు ఆర్థికంగా అండగా నిలిచింది. ఒకటీ అరా కాదు... ఏకంగా అరు పర్యాయాలు గడువు పొడగింపునకు అనుమతులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు రద్దు చేసి మరో సంస్థకు ఇవ్వాలంటే... జలయజ్ఞం సమయంలో ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పెట్టిన షరతుల కారణంగా ప్రభుత్వమే అప్పనంగా కోట్లాది రూపాయల్ని తిరిగి జేపీకి చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర విభజనతో హెడ్ రెగ్యులేటర్ పనులు ఆంధ్రప్రదేశ్ భూ పరిధిలోకి వెళ్లిన దుమ్ముగూడెం-టెయిల్ పాండ్ ప్రాజెక్టు కాంట్రాక్టు రద్దుతో ప్రభుత్వం భారీ మొత్తాన్ని భరించాల్సి వచ్చింది. పైగా కాంట్రాక్టు రద్దు చేస్తే టీబీఎం యంత్రాలను సదరు నిర్మాణ సంస్థ తీసుకుపోలేదు. అలాగని వాటిని వెనక్కి తీసుకువచ్చే పరిస్థితి కూడా ఉండదు. దీంతో ఆ కంపెనీతోనే ఎలాగోలా నెట్టుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది.

దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ వద్ద కన్వేయర్ బెల్ట్‌ను పునరుద్ధరించి టన్నెల్‌లోని బురద, మట్టిని బయటకు తరలిస్తున్న దృశ్యం

కన్వేయర్ బెల్ట్ స్టార్ట్

- 11వ రోజు మట్టి, బురద బయటకు తరలింపు
- జీరో పాయింట్ వద్ద ప్రవాహం ఉన్నట్టు గుర్తింపు
- టన్నెల్ వద్దకు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధులు

నాగర్‌కర్నూల్, మార్చి 4 : ఎల్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్నవారి కోసం రెస్క్యూ టీమ్ చేపడుతున్న సహాయ చర్యల్లో స్వల్ప పురోగతి సాధించింది. మంగళవారం 11వ రోజు కన్వేయర్ బెల్ట్‌ను సిద్ధం చేసి టన్నెల్‌లో పేరుకుపోయిన మట్టి, రాళ్లను తొలగించి బయటకు తరలించే ప్రక్రియను ప్రారంభించారు. ఓవైపు నీటిని హెవీ మోటర్ల ద్వారా బయటకు తరలిస్తూ మరో వైపు కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టిని బయటకు తోడిపోస్తున్నారు. టన్నెల్‌లోని జీరో పాయింట్ నుంచి 12వ కిలోమీటర్ వరకు నీరు నిల్వ ఉండడంతో ఓవైపు డీవాటరింగ్ చేస్తున్నారు. పూర్తిగా మట్టిని, శిథిలాలను బయటకు తీస్తేనే మృతదేహాలు వెలుగు చూసే అవకాశం ఉండడంతో రెస్క్యూ టీమ్ వేగం పెంచింది. జీరో పాయిట్ వద్ద డీటీ నాగిరెడ్డి పర్యవేక్షించారు. టీబీఎం మిషన్ కటింగ్ పనులు వేగంగా కొనసాగుతుండడంతో త్వరలో మృతదేహాలు బయటపడే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌పై సమీక్ష

రెస్క్యూ ఆపరేషన్‌ను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, కలెక్టర్ సంతోష్ సమీక్ష నిర్వహించారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ డీజీపీ నాగిరెడ్డి, టీఎస్ఎస్పీ డీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కల్నల్ మెహ్రా, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి ప్రసన్న, హైడ్రా, సింగరేణి మైన్స్, ఎస్‌డీఆర్ఎఫ్ తదితర రెస్క్యూ బృందాల ప్రతినిధులు పాల్గొన్నాయి.

డిగ్రీ విద్యార్థులతో ‘సైబర్ సోల్జర్స్’

- వారం పది రోజుల్లో శిక్షణ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : విద్యార్థి దశలోనే సైబర్ మోసాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయం తీసుకున్నది. ‘సైబర్ సోల్జర్స్’ పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేయనున్నది. సైబర్ మోసాలు జరుగుతున్న తీరు, వాటితో ఎలా జాగ్రత్తగా వ్యవహరించాలో అవగాహన కల్పిస్తారు. రాష్ట్రంలోని 5.8లక్షల మంది డిగ్రీ విద్యార్థులను సైబర్ సోల్జర్లుగా తయారుచేస్తారు. ఇందుకోసం తొలుత ట్రైనర్స్ (శిక్షకులను) సిద్ధం చేస్తారు. ప్రాథమికంగా వెయ్యి మంది ట్రైనర్లను సిద్ధంచేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ వెయ్యి మంది డిగ్రీ కాలేజీలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. వారం పది రోజుల్లో సైబర్ సోల్జర్స్‌కు శిక్షణ ప్రారంభించనున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ వీ బాలకృష్టారెడ్డి తెలిపారు.

అడుగంటిన చెరువులు

మొదటిపేజీ తరువాయి...

మాత్రం 10 శాతానికి మించదని భూగర్భ శాస్త్ర నిపుణులు చెప్తున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో నీటిని ఒడిసిపట్టడంలో, భూగర్భజలాలను పెంచడంలో చెరువులు, చెక్‌డ్యామ్‌లు తదితర నిర్మాణాలే అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకునే కాకతీయులు వేలాది సంఖ్యలో చెరువులను నిర్మించారు. నీటి వనరులను ఒడిసిపట్టారు. ఉమ్మడి పాలకులు ఆ చెరువులను విచ్ఛిన్నం చేయడంతోపాటు వ్యవస్థ మొత్తాన్ని నిర్లక్ష్యం చేశారు. దీంతో తెలంగాణ పడావు పడ్డది. ఇది చరిత్ర. ఈ వ్యవస్థ మొత్తాన్ని అధ్యయనం చేయడంతోపాటు ఆకళింపు చేసుకున్న నాయకుడు కేసీఆర్. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఆవిర్భావం తరువాత మిషన్ కాకతీయ చేపట్టి చెరువుల పునరుద్ధరణకు పూనుకున్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టారు. అక్కడితో ఆగకుండా ఉమ్మడి పాలకులు విచ్ఛిన్నం చేసిన గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను పునఃప్రతిష్ఠ చేయడంలో భాగంగా వాటిని ప్రాజెక్టులతో అనుసంధానించారు. ప్రతి సంవత్సరం జనవరి లేదంటే ఫిబ్రవరిలోనే చెరువులను క్రమం తప్పకుండా నింపేలా చర్యలు చేపడుతూ వచ్చారు. ఫలితంగానే రాష్ట్రంలో భూగర్భజల మట్టం పెరుగుతూ వచ్చింది. పంటలకు భరోసా లభించింది.

అక్టోబర్ మొదటివారం నాటికే 40% ఖాళీ

ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిశాయి. అయినా, అక్టోబర్ మొదటి వారం నాటికే చెరువులు అడుగంటడం ప్రారంభమైంది. గత పదేండ్లలో చూడని విభిన్నమైన పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా 34,712 చెరువులు ఉండగా అక్టోబర్ నాటికే 13,211 చెరువుల్లో జలాలన్నీ అడుగంటిపోయాయి. 17,592 చెరువుల్లో 50% కంటే తక్కువ నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన చెరువుల్లోనే కొద్దిమేర జలాలు ఆశాజనకంగా కనిపించాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చెరువులన్నీ అడుగంటాయి. కొన్నిచోట్ల మాత్రమే చెరువుల్లో నీళ్లున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నల్లగొండ, కామారెడ్డి, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి ఇరిగేషన్ సర్కిళ్ల పరిధిలోని 90% చెరువులు దాదాపు అడుగంటిపోయాయి. మిగతా ఇరిగేషన్ సర్కిళ్ల పరిధిలోని చెరువుల్లోనూ కొద్దిమేర మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి.

పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు

డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి పాలకుల తరహాలోనే చెరువులను ఈ ఏడాది నిర్లక్ష్యం చేసింది. చెరువులను నింపే పక్రియను పూర్తిగా విస్మరించింది. కారణం ఏమంటే నీటి కొరత ఉందనేది ప్రభుత్వం నుంచి వస్తున్న జవాబు. ప్రాజెక్టుల కింద ఆయకట్టుకే సాగునీరు అందని దుస్థితి నెలకొన్నది. ఈ ఏడాది నవంబర్ నాటికి ఎస్సారెస్పీలో 80 టీఎంసీలు, మిడ్‌మానేరులో 25, ఎల్ఎండీలో 23.42, ఎల్లంపల్లిలో 20.18, సింగూరులో 26.81, నిజాంసాగర్‌లో 17, కడెంలో 7, శ్రీశైలంలో 190, నాగార్జునసాగర్‌లో 305 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయి. అందులో కొద్దిమేర నీటితోనైనా ఆయా ప్రాజెక్టుల పరిధిలోని చెరువులను కనీసం 50% నింపినా ఈ రోజు కరువు కోరల్లో చిక్కుకోవాల్సిన పరిస్థితి తలెత్తి ఉండేదని కాదని అధికారులు చెప్తున్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం స్వతహాగా ఆ పనిచేయలేదు, అనుభవజ్ఞులైన అధికారులతోనూ చర్చించలేదు. నీరు అందుబాటులో ఉన్న దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీటిని లిఫ్ట్ చేయడం లేదు. రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేసిన సందర్భాల్లో పలు చోట్ల చెరువులు, చెక్‌డ్యామ్‌లకు నీళ్లు వదిలింది. కానీ, చెరువులను నింపాలనే ఆలోచన లేకపోవడమే ప్రభుత్వ పెద్దల అవగాహన రాహిత్యానికి అద్దం పడుతున్నదని అధికారులు, రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధాన కాలువల ద్వారా మాత్రమే కొన్ని ప్రాంతాలకు సాగునీళ్లను ఇస్తున్నది తప్ప చెరువులకు విడుదల చేయడం లేదు. దీంతో ఆయా చెరువుల కింద రెండో పంట సాగు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొంటున్నాయి. వెరసి కృష్ణా బేసిన్‌తోపాటు గోదావరి బేసిన్‌లోనూ పరోక్షంగా పంటలు చేతికందని దుస్థితి నెలకొన్నది.

కొన్ని ప్రధాన మేజర్, మీడియం ప్రాజెక్టులు, వాటితో లింక్ చేసిన చెరువులు

ప్రాజెక్టు	చెరువుల సంఖ్య
కాళేశ్వరం	846 (ప్రధాన కాలువలతో)
ఎస్సారెస్పీ 1	1,304
ఎస్సారెస్పీ 2	843
నాగార్జునసాగర్	574
దేవాదుల	2,000
నిజాంసాగర్	313
ఎస్ఎల్‌బీసీ	251
సింగూరు	167
కోయిల్‌సాగర్	107
కడెం	115
ఎల్లంపల్లి	122
భక్తరామదాసు	172
జూరాల	185
భీమా	143
నెట్టెంపాడు	103
రాజరాజేశ్వర	100
అలీసాగర్	84
గుత్ప	68
చౌటుపల్లి హన్మంతరెడ్డి	28
ఎస్సారెస్పీ వరద కాలువ	30
కల్వకుర్తి	40
ఆసిఫ్‌నహర్	63

(నోట్: ఇవి గత ఏడాది వరకు అనుసంధానించినవే)

చెరువుల విస్మరణతోనే బోర్లు విఫలం

ఉమ్మడి రాష్ట్రంలో గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయ బోరుబావుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అయితే, ఆ బోరుబావులకు కావాల్సిన భూగర్భజలాల లభ్యతకు మళ్లీ ఆ చెరువులే ప్రధాన భూమిక పోషిస్తూ వచ్చాయి. పూడికలు పెరిగినా భూగర్భజలాలు అడుగంటిపోవడం, కరెంటు కోతలతో యావత్ తెలంగాణ వ్యవసాయరంగం సంక్షోభానికి గురైంది. పదుల సంఖ్యలో, వందల అడుగుల్లో బోర్లు వేయడం, నీటి ఊటలేక అవి ఎండిపోవడం పరిపాటిగా మారింది. రాష్ట్ర ఏర్పాటు నాటికి తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 20 లక్షల బోరుబావులు ఉండగా, వాటికింద సాగయింది 23 లక్షల ఎకరాలే. అది కూడా ఎప్పుడూ స్థిరంగా ఉన్నది లేదు. వానలు పడినా ఎండిపోవాల్సిన దుస్థితి. తెలంగాణ ఏర్పాటు తరువాత కేసీఆర్ అమలు చేసిన బహుముఖ జలసంరక్షణ చర్యల ఫలితంగా బోరుబావుల కింద వ్యవసాయం కూడా పండుగలా మారింది. దాదాపు 45 లక్షల ఎకరాలు 30 లక్షల బోర్లు కిందనే సాగయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కానీ, కాంగ్రెస్ పాలనలో మళ్లీ బోర్ల కింది సాగు సంక్షోభం దిశగా సాగుతున్నది. చెరువులను నింపకపోవడం వల్లే బోర్లన్నీ ఎండిపోతున్నాయని రైతులు చెప్తున్నారు. వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోవడానికి కూడా అదే ప్రధాన కారణమని అర్థమవుతున్నది. ప్రభుత్వ అవగాహన రాహిత్యం ఫలితంగానే కరువు దాపురించిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

గత మూడేండ్లలో రాష్ట్రంలోని చెరువుల్లో న